# చామన-చాయ

[లక్ష్మీదేవి మాయమైపోయింది; – ఏమైపోయిందో, ఎవరికీ తెలియదు. నింద మోయలేక, ఎందులోనో దూకి ఉంటుందని కొందరు అనుకున్నారు.

ప్రాణం–తీపి చావనివాళ్ళు... ఎబ్బే అదికాదు, ఏ అధ్వాన్నపు అడవులో పట్టి ఉంటుందని, సిద్ధాంతం చేశారు.

ఏమైతేనేం, లక్ష్మీదేవి మాయమైపోయింది.

పోయిందని హఠాత్తుగా తెలిసినప్పుడు ఏమైపోయిందో అని గుండెలు తోడుకుపోయినవి. కాని––

కాని...లక్ష్మి పోయినందుకు, పరమానందమైంది. అలాటివాళ్ళు బ్రతికేలోకం ఎక్కడన్నా వేరే ఉందా?

మా జాతి, జాలిపడేందుకుకూడా నోచుకు జన్మ ఎత్తలేదు...కాని, తాతకు ఉన్న పాటినీతికి కారమాలినా మాకూ బాధలు భరించే పడుచుదనం, రొక్కంతో బాటు కలకాలమూ ఉండదు.

లక్ష్మి పోవడమే, మంచిది...కాని ఆ మాట నా నోటివెంటరావడం...అది ఏనాడో, మాలో ఏ తరంవాళ్ళో చేసుకున్న పాపం––

పాపం...లక్ష్మీదేవి...]

––ఏం మాయచేశో, ఏలాగో మరులుపుట్టించి, సుబ్బారావు రెండో కొడుకు, లక్ష్మిందేవి గొంతుకోసి, నట్టేట్లోదించాడు అని– నాకు నీళ్ళుతోడిపెట్టే హనుమాయమ్మ, నిన్న ఉదయం చెబితే – మొదట నేను నమ్మలేదు. సుమా!

లక్ష్మీదేవి గుణం అలాంటిదని నేను అనుకోలేదు.

...దరిద్రుడి కూతురు: దరిద్రుడి మనుమరాలు. ఆ పిల్లదానికి డబ్బు విలువ ఏమిటో తెలియదు: తల్లీతండ్రి చిన్నప్పుడే పోయినా, తాత, దానికి వేయిమంది బలగం పెట్టు: బొడ్డు ఊడనప్పటినుంచీ పూవుల్లో పెట్టి పెంచేవాడు: ఆ కుటుంబానికి "ఇదిలేదు" అనేలోటు ఏకోశానా లేదు. మాతోటనే నమ్ముకుని – మాయింటినే నమ్ముకుని – తరతరాలుగా వర్ధిల్లుతూ వచ్చారు...నేటిదాకా–

నా కళ్ళముందర పెరుగుతూన్న పసిపిల్ల కాబట్టి, ఎన్నడు పెరిగి పెద్దదైందో నేను గమనించలేకపోయినాను. ఈడువస్తూన్నదనీ, చూసిన కుర్రవాళ్ళ నోరూరించే తళుకు బెళుకూ ఆ చిన్నదానికి అబ్బినవనీ – నాకు ఆ ధ్యాసే లేదు సుమా – ఫలానా మనువు అమిరిందని, వాళ్ళ తాత నాదగ్గిరకు ఎన్నడో ఓనాడు వచ్చి చెపుతాడు: అప్పుడు. సరే. సలక్షణంగా, సారె చీరెపెట్టి, అత్తవారింటికి పంపించడం

ఎలాగూ జరుగుతుంది. అందుచేత, నాకు ఆ ఆలోచనే పోలేదు. చివరకు ఇలా ముణుగుతుందని కలగననూ లేదు.

--వినేప్పటికి నాకు మతిపోయింది. స్నానానికి చెంబుఎత్తి మీద పోసుకోబోతున్న వాడినల్లా, ఆ పాళాన అవి అక్కడ పారేసి...అలాగే, వాళ్ళ పాకవేపు పరిగెత్తాను...బిక్కు బిక్కుమంటూ అక్కడక్కడ గింజలు కొక్కిరిస్తూన్న కోడి పెట్టలు నా విసురుకు, రెక్కలు విలవిల లాడించుకుంటూ మలుపు తిరిగి పారిపోయినవి...అలికిడి సడికట్టి, చూపుమేరలో గున్న మామిడివారను కుక్కిలో కూలబడి ఉన్న తాత, లేచి, నన్ను చూసి, విల-విలలాడుతూ వచ్చి, సగం దూరంలో కుప్పకూలినట్లు కూలిపోయినాడు.

'బాబయ్యా, ఈ తప్పంతా నాది: ఇదంతా ఏనాడో నేను చేసుకున్న పాపం...' ఒక్కొక్క మాట కుమిలి-కుమిలి బయటపడుతూన్నది.

"నెయ్యావణ్ణంతినే మహారాజులకు, నీచపు బుద్ధులు పుట్టిస్తాడు ఎందుకు బాబూ భగవంతుడు?"

తాత కనుకొలకుల్లో ఒక్క నీటి బిందువైనా లేదు. మొగమంతా, కాగిన తాషామరఫా చర్మంలాగా బిర్రబిగిసి పెటపెటలాడుతూ ఉంది. కన్నీళ్ళలో తెప్పతేలకపోతే, గుండెను పట్టుకుపోయిన శోకం ఆ ముసలిజీవాల్ని విరుచుకు తినేస్తుంది...తాతను ఏడిపించకని...మా ఇలవేలుపులకు వేయివిధాల మ్రొక్కుకున్నాను.

ఏముందీ, మామూలు కథే...

ఎవడో అయినయింటి పిల్లవాడు, ఏమీ అభమూ శుభమూ తెలియని అమాయకపు పడుచును...ఎలాగో గోతిలోదించి...చేతులు దులుపేసుకుని, తనత్రోవను తాను చక్కాబోడం...

ఒళ్ళుపరవశించిన తీయదనంలో, చేసేదేమీ తెలియక...తీరా నిలువునా మునిగిన తరువాత చేసింది తప్పని తెలుసుకుని...ఏ పాపమూ నిజానికి ఎరుగని ఆ పిల్లది...ఆహుతి అయిపోవటం...కోటి-కోట్ల పర్యాయములు జరిగింది ఇలా. లోకంలో ఇలాగే జరుగుతుంది.

--కాని అలా అనుకుని ఊరుకునేందుకు మనసు ఒప్పుతుందా? - నిలువెల్లా దహించుకుపోతుంది - మమకారము అలాంటిది; లక్ష్మిదేవి, నాకు చిన్న చెల్లాయ్.

"ఇహ ఈ జన్మకు, నా కళ్ళకు కనబడదు నా తల్లి... దాని అభిమానం నాకు తెలుసును..." నా అభిప్రాయమమూ అదే: నేను ఎరుగున్నంతలో, లక్ష్మిందేవి ఎన్నడూ ఎవరిచేతనూ మాటపడి ఎరుగదు: కులానికి పేద అన్న మాటగాని, ఆ కుర్రదాని గుణం విలువకట్టరానిది...

"ఏం తల్లీ, అలా ఉన్నావు" అన్నాడట, పిల్ల ఏదో నలతగా, పరాకుగా ఉండటంచూసి:

"ఏం లేదులే" అన్నదట:

"ఏం లేకపోవడమేమిటే?...చెప్పు"మని బ్రతిమాలాడట: నిర్బంధించాడట: బుజ్జగించాడట...

"నేను, నీళ్ళోసుకున్నాను?" అన్నదట...

"ఎందుకలా నిలుచుంటావ్ సిగ్గులేక? పోయి ఏ ఏట్లోనన్నా కలు..." అన్నాడు..."సరేలే తాతా" అన్నది- వెళ్ళిపోయింది...

లక్ష్మీదేవి చుట్టుప్రక్కల ఎక్కడా తేలలేదు-ఏమై పోయిందో తెలియలేదు...

--ఓనాడు చీకటిలో, తాత, నా నిద్రమంచందగ్గిరకు వచ్చాడు.

"సెలవియ్యి బాబూ - నేను పోతాను" అన్నాడు క్రుంగిపోతూ.

"ఎక్కడికి"

"ఎక్కడికంటూ ఏమిటి-లక్ష్మి ఎక్కడుందో..."

తాతకు మతిబోయిందనుకున్నాను.

"ఎక్కడెక్కడో వెదుకుతాను...ఏ అధ్వాన్నపు అడవిలోనో వెదుకుతూ రాలి పోతాను. ఊరికే ఉంటే మతిపోతూంది: మతి పోతూందనుకుంటేనే వెర్రివెత్తుకొచ్చేట్టుంది...బ్రతుకంతా మీసేవలో గడిపాను: చివరకు వెర్రిచావు చచ్చేట్టు చేయకు బాబూ-నన్నుపోని..."

తాతకు దణ్ణం పెట్టాలనిపించింది: వంగి పాదాలు పట్టుకున్నాను: తాత, రావాకులాగా కంపించిపోతూ, పసివాడిలాగా పెద్దపెట్టున ఏడుస్తూ వెళ్ళిపోయినాడు.

...నాకు, వెంటనే మతిపోయిందని చెప్పడం శుద్ధపొరబాటు: ఉన్నదో, పోయిందో. రెండురోజులపాటు, దహరాకాశమంతా చీకటిగుయ్యారం. 13వ తారీఖుమీద నిలిచి పోయిన చూపు, మేలుకుని 15వ తేదీని చూసింది.

తెలివి వచ్చినప్పటినుంచీ, ఏమిటి చెయ్యడం అని కలవరింత బయలుదేరింది...కాని, ఏం చెయ్యాలో మాత్రం పాలుపోలేదు...చివరకు నామీద దయతలచి, కాళ్ళు వాటంతట అవి చొరవ తెచ్చుకుని కాయాన్ని సుబ్బారావు యింటికి యీడ్చుకు వెళ్ళినవి. వాళ్ళయిల్లు అల్లంత దూరాన కనబడటంతోనే మనసులో బాణసంచా ఉడ్డోలంగా రగలడం మొదలు పెట్టింది. రకరకాల మారణసాధనాలు పుట్టుకు వస్తున్నాయి: దేనికదే సుబ్బారావు రెండో కొడుకుమీదికి సూటిగా దూకుతుంది. అన్ని అస్త్రాలధాక ఒక్కసారిగా తగిలితే, ఆ పరాత్పరుడే తట్టుకోలేక అవతారం మార్చుకోవలసివస్తుంది. ఒక్క అల్పప్రాణి, అనంతకోటి జీవరాసుల్లో సుబ్బారావు రెండో కొడుకు, ఏమైపోతున్నాడు?...

వాడు, దెబ్బ-దెబ్బకూ ఛస్తున్నాడు. మరో వ్రేటు తినడానికి మళ్ళా తెప్పరిలు తున్నాడు. వాడు అన్ని చావులు చచ్చినా, నా కసిలో, ఆవగింజలో - అరపాలు యింకా తీరలేదు.

--సుబ్బారావు ముందుహాల్లో తివాచీ మీద కుదిమట్టంగా కూర్చుని ఉన్నాడు, మనుమడిని ఒళ్ళోపెట్టుకుని, గుమాస్తాలు నమస్కారం చేశారు. నేమా మొత్తానికి, అంత ఆసామీనేకనుక మొగం వేయిముడతలు పడేట్టు, కోట తలుపులు విడలాగినట్లు, పుట్టెడు బరువుపెదవులసందునించి, చిరునవ్వొకటి నా వంకకు పెకలించి, ప్రక్కకు జరుగయత్నించిన గుర్తుగా ఒళ్ళు ఓ నాలువాసి కదిలించి...ఇదమిదమాసనం-గా, సరసను పతాక బోర్లగిలవేసి జరిగాడు...సుబ్బారావు ప్రక్కను కూర్చుంటే, కొవ్వొత్తుల గిడ్డంగిలో కాలు చేతులు కట్టేసి పారేస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది అవస్థ... ఏది ఎలా అయినా, యీ స్థితిలో ఫరవాలేదు.

"ఏమోయ్. మీ చిన్నవాడు ఏడీ?" అన్నాను. మాటలధోరణిలో అడిగినట్లు - కాలూ చెయ్యీ కూడదీసుకున్న తరువాత.

'ఏమో, దొరగారు ఏ రాజ్యాలు ఏలబోయినాడో-' కోపంగాలేదు. అంతో-యింతో గర్వంగానే అన్నాడు సుమీ.

"రాజ్యాలు ఏలేవాళ్ళపాట్లు, యూరప్‌లో గీరప్‌లో ఏమైనాయో చూస్తూనే ఉన్నాం కదా. తలకాయలు ఎగరడానికి సిద్ధంగా ఉన్నాయ్!"

'తలకాయ అంటూ ఉన్నవాడికికాని ఆ దిగులు-' సుబ్బారావు మరొక్కసారి నవ్వేందుకు విశ్వ - ప్రయత్నం చేశాడు. కాని, లాభించలేదు - సాగరగర్భంలో ప్రజ్వలించే బడబానలంలాగా నవ్వు, నఖ - శిఖ పర్యంతమూ లోలోనే కుతమారింది; ఉండుండి, రాలుతూంది.

....సుబ్బారావు మనమడు, యిందాకటినుంచీ తెగమారాం చేస్తున్నాడు - బల్లమీది కృష్ణవిగ్రహాన్ని యివ్వమని...ఏమరించాలని ఎన్నివిధాలో తంటాలుపడి, విసుగేసి, వాళ్ళమామ్మను కేకవేశాడు షాహుకారు. ఆ పెద్ద ముత్తైదువ ఎడంగా గుమ్మంలో నిలుచుని చేతులతో సైగచేసి పిలుస్తూంది మనుమడిని; ఆ రాలుగాయ, మరీ విలవిల లాడుతూ కాళ్ళాచేతులా నిలవకుండా యిల్లులీసి పందిరేస్తున్నాడు. సుబ్బారావు, ఇక లాభంలేదనుకున్నాడు కాబోలు, వాడితో రాజీకివచ్చి 'అది తగనిబలువు. ఏం చేస్తావురా నాన్నా' అని గారాబంగా అడిగాడు. ఆ కుర్రకుంక తడుముకోకుండా 'పగలకొడతాను' అన్నాడు. సుబ్బారావుకు, మహా - ముద్దొచ్చింది వాడి మాటలకు... 'వేలెడున్నాడో లేదో, యీ బొజ్జలో ఎంత ఊహ ఉందిరా, బాబూ' అంటూ పగలగొట్టావా అంటే నీ బుగ్గలు సాగదీసీ...బూరె లొండించి పెడతా చూసుకో' అని సాగదీస్తూ, బొమ్మ వాడిచేతికి యిచ్చాడు - వాడు ముక్కలు చెయ్యనే చేశాడు.

అవతల గుమ్మంలోనుంచి యిల్లాలు నెత్తీ నోరూ కొట్టుకుంటూ యిందాక టినుంచీ లబలబలాడుతూనే ఉంది, 'అది వాడికి యివ్వద్దు మొర్రో' అంటూ. వినిపించుకుంటేనా? - తీరా అధ్వాన్నమైపోగానే 'నిక్షేపంలాంటి బొమ్మ...' అని ఉసూరుమన్నది. సుబ్బారావు, వినిపించుకున్నట్టూ-- వినిపించుకోనట్టూ కాకుండా, 'పోనిద్దూ...చిన్నతనం, వాడిమీంచి బలాదూర్' - అని. ఇక ఆవిడ మళ్ళీ నోరెత్తేందుకు వీలులేనంత ఖండితంగా చెప్పి...నాతో సంభాషణ అందుకునేవాడిలాగా, యీ ప్రక్కకు తల తిప్పాడు.

నాకు, యిందాకటినుంచీ సల-సలలాడిపోతూందేమో, సందుచిక్కిందే వ్యవధా నంగా ఉన్నవి నాలుగూ పెట్టేశాను. పట్టుకుని, కడిగి - కడిగి వదిలి పెట్టాను, అతని సుపుత్రుడు చేసిన ఘనకార్యం.

అంతావిని - సుబ్బారావు ఎంతో నొచ్చుకుంటాడు...ఎంతో ఖిన్నుడై పోతాడు... పాపపరిహారం ఏమిటని అడుగుతాడు... ప్రాధేయపడుతాడు... తప్పక అలా జరిగితీరుతుంది-అని అనుకున్నాను.

సుబ్బారావు ఏంచేశాడో తెలుసునా, విని-విని బద్ధకంగా చిటికెవేస్తూ ఆవలించి ఒక్క నిమిషం నిదానించి "పోనిద్దూ, ఏదో చిన్నతనం" అని ఒక్కమాటలో కొట్టేశాడు.

నిలువునా నీరవడమంటే ఏమిటో అప్పుడు నాకు తెలిసివచ్చింది. మొగం అప్పచ్చి అయ్యేట్టు ఒక్క గుద్దు గుద్దుదామనిపించింది. కాని, గోడనుగుద్దితే ఎంతో – అంతే...అయినా, నేనూ, ముసిలివాణ్ణే:– పసివాడు బొమ్మను పగుల గొట్టినా, వాడు రేపీ పాటికి ఎదిగి ఎవతె జీవితమో భగ్నం చేసినా...రెండూ ఒకటే అవ్వాలి దృష్టిలో ఏం చెప్పినా అంతకన్న ఆ జీవానికి, అర్థంకాదు.

ఈ ప్రబుద్ధుడి కొడుకు...వాడు మరీ యింతకన్న ఛండాలుడౌను.

–ఆదికాలంనాడు, ఖజానాకొట్లు మూలగకుండా, భూతాలూ బ్రహ్మరాక్షసులూ కాపలా కాస్తూంటాయట. వాటికి, ఆకలైనప్పుడల్లా, కూర్చున్న చోటనుంచే, ఏదో ఓ జీవాన్ని జుర్రున పీల్చి, చప్పరించి, ఒళ్ళుగుక్కను మింగేసి మళ్ళీ ఆకలయ్యేదాకా...ఏమీ ఎరుగనట్లు అలా చలనం లేకుండా మొద్దుల్లాగా పడి ఉంటాయట– అని, నా చిన్నతనంలో మా అమ్మమ్మ, కాకమ్మ–పిచికమ్మ కథల్లో చెప్పిన ముక్కకు తిరుగుడు ఏభైఏళ్ళకు అర్థం అయింది...

––సుబ్బారావుమీద, కోపంరాలేదు. మనిషి కాదుకదా అని, చచ్చేటంత – జాలి వేసింది...లక్ష్మీదేవి బ్రతికి ఉండి –– బట్టకడితే... చిగురుకు మరోభూతాన్ని కనేదేమో అని భయం వేసినమాట నిజం.

లక్ష్మీదేవి పోయినందుకు పరమానందమైంది.

★ ★ ★